వాళ్ళనలా వదిలేద్దాం

శ్రీ కేమాని సంగమేశ్వరరావు

1

తన గదిలో కూర్చొని "ప్రోబ్లమ్స్" "సాల్వ్" చేస్తున్నది "దమయంతి." దీర్ఘంగా ఆలోచిస్తూ చేస్తున్నాదేమో అందులో లీనము అయిపోయినట్టుగావుంది. సూర్యాస్తమానవు అరుణ కిరణాలు ఆమె ముఖంమీదపడుతూ అదోలా మెఱుస్తున్నాయ్! ముంగురులు ముఖంమీద కొంచముగాపడుతూ అదో అందాన్ని ముఖానికి తెస్తున్నాయి!

ఆవులిస్తూ బద్ధకంగా ఒక మారు ఒళ్లు విరిచింది దమయంతి. పుస్తకాలుసర్ది పైట సర్దుకొనిలేచింది. పుస్తకాలు "షెల్ఫు"లో పెట్టింది. ఈజీఛైరు మేడమీది ఉత్తరవు కిటికీ కెదురుగాలాక్కొని దానిమీద మేను వాల్చింది కిటికీలోంచిచూస్తూ

ఉత్తరవుదిక్కు కిటికీ దగ్గర కూర్చొని చూస్తే, రోడ్డు – రోడ్డుమీద దట్టంగా తిరుగుతున్న జనం, వాహనాలరొద ... గజిబిజిగా వుంది!

అసలు ఏకాంతము కోరేదీ, ఎల్లప్పుడూ అంతులేని ఆలోచనలతో రోజులు గడిపేదీ దమయంతి! అందుచేత ఆ రోడ్డుమీది వాతావరణం ఆమెకు ఏమీ ఆహ్లాదము కలిగించలేకపోగా, ఒక విధమయిన అయిష్టతను కలిగించింది.

లేచి కుర్చీని స్థలం మార్పు చేసింది. పశ్చిమపు కిటికీ దగ్గరకు కుర్చీలాక్కొని "షెల్ఫు" దగ్గరకువెళ్ళి చేతికి వచ్చిన పుస్తకం తీసింది. కుర్చీలో మేనువాల్చి, పుస్తకం వొళ్లో వేసుకొని కిటికీలోంచి చూస్తున్నది.

కిటికీలోంచిచూస్తే ఎదురుగా కొన్ని మేడలు, కొన్ని డాబాలు సమానమయిన ఎత్తులో వున్నాయ్! అక్కడక్కడ కొబ్బరిచెట్లు, వాటి ఆకులసందులలోంచి అస్తమిస్తున్న సూర్యుడు ... అదోలా దమయంతి మనస్సును కొంచం ఆకర్షించినాయ్!

పుస్తకం పేజీలు త్రిప్పడంమానేసి ఏదో మనస్సులో తలుచుకుంటున్నాది.

"జానకికి అప్పుడే పెళ్లి అవడమే కాకుండా ఒక ఆడపిల్లకూడాను! ఇంత చిన్నవయస్సులోనే సంసారం...పిల్లలు... బాధలు ... అయినా జానకిలో ఈ దిగులు గాని, ఈ విచారంగాని వున్నట్టు కనిపించవు! చీకు చింతాలేకుండా నిర్విచారంగా జీవిస్తున్నట్టు కనిపిస్తున్నది. పెళ్ళయిన

తరువాత జానకి కళ్లల్లో ఒక విధమయిన వింత కాంతి రావడం తను చూసింది!

పెళ్లికి తనూ వెళ్లింది. అక్షింతలు చల్లుతూ అందరిలాగానే తనూ ఆశీర్వాదాలు చేసింది. అయితే మనసులో మాత్రం దమయంతికి జానకి పెళ్లి చేసుకోవడం ఎంతమాత్రం యిష్టంలేదు! ఇప్పటినుండి ఈ సంసార నరకంలో పడిపోతున్నాది అనే బెంగ దమయంతికి పట్టుకుంది - జానకికి లేకపోయినా!

పెళ్లయిన కొత్తలో జానకి పతీ సమేతంగా తన యింటికివచ్చి తన భర్తను పరిచయంచేసింది! అతని ముఖంలో కొంచము క్రౌర్యము కనబడుతూంది. చిన్నవిలాసం, ఎగదువ్వడు క్రాపింగు ... పేరు విశాలరావు! పేరుకేం బాగానేవుంది! మనిషి మాత్రం తనకి నచ్చలేదు! ఎందుకో అతన్ని చూడగానే ఒక విధమయిన విముఖత్వం తనకి కలిగింది! ... అప్పుడే నవ్వుకుంది. బాగుంటేనేం? బాగులేకపోతేనేం? తనకెందుకు? కాపరం అతనితో చేస్తున్నది జానకికాని తాను కాదుకదా! అయినాజానకి మాత్రం యివేమీ పట్టించుకోకుండా సంతోషంగా, గర్వంగా, ఏదో ఎవరికీపట్టని అదృష్టం తన ఒక్కతెకే కలిగినట్లు భావిస్తూ తన పతిని పరిచయంచేసింది.

తనూ పెళ్ళిచేసుకోవాలి! చేసుకోవడం తను మానివేసినా లోకం వూరుకోదు! తనకి పెళ్ళిచేసి తీరుతుంది. ... అంతవరకూ ఎందుకు? రోజూ తన తల్లి ఒకటేపోరు తన పెళ్లిని గురించి! తన తండ్రి మాత్రం చాల గంభీరుడు. ఏ విషయములోనయినా చప్పున తేలిపోడు. తన తల్లిది మాత్రం కొంచం బోళా మనస్తత్వం! కష్టంలోగాని సుఖంలోగాని యిట్టే బయట పడిపోతుంది. మళ్ళా తన అన్నయ్యాదీ సరిగ్గా తల్లి మనస్తత్వమే! ప్రతీదానికి కసురుతూ చిరాగ్గావుంటాడు. ప్రతి గుణం అతనిలో అతిగా వున్నాయ్!

తనకి తండ్రిపోలిక వచ్చింది అనుకుంది. మళ్లా తన ఈ తలంపులకు తనే నవ్వుకుంది.

ఇంతసేపూ తను సులువుగా "సాల్వ్" చేసిన "ప్రోబ్లమ్స్"లాగ కాకుండా తనకి ఇప్పుడు ఒక "అన్‌సాల్వ్‌డు ప్రోబ్లమ్" వచ్చిపడ్డది!

"వివాహమాడడమా? లేక మానడమా? ఆడితే ఎవరిని చేసుకోవాలి? ఈ ప్రశ్నలకు నిజంగా పందొమ్మిదిఏళ్ల వయస్సులోవుండి II year-arts చదువుతున్న దమయంతే తేల్చి చెప్ప లేక పో యిం దంటే దమయంతిలో ఒక విధమయిన "బలహీనత" (Weakness) వుందన్నమాట.

జానకిపెళ్లి ఇట్టె నిశ్చయింపబడ్డాది! అట్టె జరిగిపోయింది! ఓకమారు మాత్రం

వరుని చూసింది. అంగీకారం చూపింది! అంతే!

ఒక్క జానకేయేం? తన స్నేహితురాండ్ర పెండ్లిండ్లు తను చాలా చూసింది. అన్నీ ఇలాగ జరిగినవే! కాని తను ఒక్కతా మాత్రం ఏదారికీ రాలేకపోతున్నాది. ఏం! వాళ్లందరూ హాయిగా జీవించలేదా? తనూ వివాహం చేసుకుంటే అలాగే హాయిగా జీవించగలదేమో!

ఏమో? ఎవరు చెప్పగలరు? పెళ్లయిన తరువాత కష్టాలపాలైనవాళ్లు, భర్తలచేత తిరస్కరింపబడ్డవాళ్లు, ఆత్మహత్యలు చేసుకున్నవాళ్లు ఎంతమందిలేరు! అయితే పెళ్లి అయిన తరువాత అది ఎలా పరిణమిస్తుందో ఏంచెప్పగలం? ప్రతీదీ మనకి చెప్పిరాదుగా!

"జీవితాన్ని సుఖమయంగాగాని దుఃఖమయంగాగాని చేసుకోవడం వాళ్లమీదే ఆధారపడి వుంటుంది" అని నిర్వచనం చెపుతూ వుంటుంది జానకి. ఎలాగయినా జానకి అదృష్టవంతురాలు."

చీకట్లు నలుపక్కల వ్యాపించేయి! ఒక్కడక్కడ మేడగదుల్లో ఎలక్ట్రిక్ దీపాలుకూడా వెలిగేయి!

ఈ భావాల్లో పడిన దమయంతికి చీకట్లో కూర్చోడం కొంచం భీతి కలిగించింది. బద్ధకంతో లేచి "స్విచ్" వేసింది. గది ప్రకాశవంతంగా వెలుతురుతో వెలిగింది. పుస్తకం టేబిలుమీదపడేసి తల సర్దుకుంటూ అద్దంలో తన ప్రతిబింబం చూసుకుంది! దమయంతి ఒక విధంగా అందకత్తే! అయితే ఆవేళ తన ప్రతిబింబం తనకే అంత బాగా వున్నట్టు కనిపించలేదు. కళ్లు లోతుకు వెళ్లిపోయి, కాంతులు తప్పేయి. ముఖం వాడివుంది!

దువ్వెనతో ముంగురులు కొంచం సర్దుకుంది. పౌడరు డబ్బామూత తెఱచింది. మళ్లా ఏమనుకుందో దాని మూత పెట్టి యధాస్థానములో దానిని వుంచేసింది!

ఎందుకో ఇవాళ కాలగమనం వడి తగ్గినట్టు భ్రాంతి పొందింది దమయంతి! ఎల్లప్పుడూ ఏకాంతము కోరే దమయంతికి ఇవాళ ఏకాంతము మీద ఏవగింపు కలిగినట్టయింది! ఏదో తనలోనే మధనపడసాగింది. కాలకూటంలాగ భావాలు బయటకూరావు! లోలోపల జీర్ణంకావు!

పక్కనేవున్న "ఫిడిల్ కేస్" క్లిప్పులు తీసి తెఱచింది. ఫిడిల్ బయటకు తీసింది. తీగెలు ఒక్కమాటు చేతితో సన్నంగా మీటింది. పయిట చెంగుతో దాని ధూళి దులిపింది. ఇవన్నీ తనకి తెలియకుండానే జరిగిపోతున్నాయి! 'కామాను' తీసి ఒక్కమాటు దాని తీగెలమీద గీసింది. అపస్వ

రాలు వస్తున్నట్టువున్నాయి! యథాస్థానములో ఫిడేలు వుంచింది. లేచి మెట్లుదిగ నారంభించింది కిందికి రావడానికి.

తల్లి వంటలక్క ఏమిటో మాట్లాడుతున్నారు. మూడు రోజులు శలవు అడుగుతోంది వంటలక్క తల్లిని! విశ్వేశ్వర రావుగారి అమ్మాయికి వివాహమట! —

తల్లి "ఎలాగు? వీలులేదు! నేను ఈ పనిఅంతా చేసుకోలేను"అని అంటున్నాది.

ఆఖరి మెట్టు దిగుతూ బాల్కనీగోడ పట్టుకొని ఆగిపోయింది దమయంతి. విశ్వేర రావుగారి అమ్మాయి అంటే తన క్లాసుమేటు రమణమ్మ అన్నమాట. బాగుంది! రమణమ్మకి వివాహమా! తనకి ఇప్పటినుండి పెళ్ళి వద్దు అని ఎన్నో ప్రగల్భాలు కొట్టిన రమణమ్మ పెళ్ళికి ఎలావప్పుకుందో? ఇంట్లో తల్లిదండ్రులను ఎదిరించే బలం లేకపోయింది కాబోలు!

అయినా ఈ తల్లి దండ్రులు కొన్ని విషయాలలో మంచిగావున్నా కొన్నిటిలో మాత్రం కర్కోటకులుగా తయారవుతారు! పిల్లలు పెళ్ళిచేసుకుంటేనేం? లేకమానితేనేం? ఎవరిని చేసుకుంటేనేం? అని వూరుకోరు. ఒకటేపోరు!

రమణమ్మకి పెళ్ళి అని తనకిప్పుడు వంటలక్క మాటలవలన తెలిసింది.

"ఇన్విటేషను" ఇవాళో రేపో పంపుతుందన్నమాట. తనకీ రేపో మాపో పెళ్ళి అవుతుంది. ఆగుతుందా? దమయంతి కళ్ళ ఎదుట తన వివాహము"ఇన్విటేషన్ కార్డు" ప్రత్యక్షమయింది! ఒక అరసెకండు తను తన భర్త ప్రక్కన నిలబడ్డట్టు భావించింది.

బాగున్నాయి తలంపులు! అవుతుందో మానుతుందోగాని అయినట్టే తను తలుస్తున్నాది. తనలో చిరునవ్వునవ్వుకుంది. దిగి వెళ్ళి తల్లి ప్రక్కన సోఫాలో మౌనంగా కూర్చుంది!

"మూడు రోజులకంటె ఎక్కువవుండకు! నేను చేసుకోలేను. రేపటినుండి వెళ్ళు"అని అన్న తన తల్లి మాటలకు అంగీకారం చూపుతూ వంటలక్క వంటింటిలోకి నడిచింది.

"ఏమమ్మా!అలా నిరుత్సాహంగా వున్నావ్"? అని ప్రేమతోతన తల నిమురుతూ తల్లి అడిగింది.

ఒక్క నిముషం మౌనంగా వూరుకొని "ఏంలేదమ్మా" అని జవాబు యిచ్చి దమయంతి లేచి టేబిలు దగ్గరకు వెళ్ళింది. రేడియో స్విచ్ ఆన్ చేసింది. తల్లి తనపక్క అదోలా చూసి వంటింటిలోకి వెళ్ళడం గమనించింది దమయంతి.

త్యాగరాజ కీర్తన రాగ తాళ భావ యుక్తముగా పాడుతున్నాడు రేడియోలో

ఎవరో గాయకుడు. ఇంకొక దినమయినా, ఇంకొక "మూడ్"లోవున్నా విని ఆనందించ గలిగేది. ఇప్పుడు అది తన్ను ఆకర్షించ లేకపోగా చెవులకు కఠోరంగా వినిపించ సాగింది! రేడియో "ఆఫ్" చేసేసి హాలులో అటు యిటూ పచారు చేస్తున్నది! ఎదురుగాగోడకు మేనక విశ్వామిత్ర పఠము కనిపించింది! ఒక్కమాటు పఠము దగ్గర నిలబడి వెంటనే అక్కడనుండి కదిలి సోఫా వద్దకు వచ్చికూర్చుంది.

అన్నయ్య టెన్నిసు రేకటుతో వడి వడిగా ప్రవేశించి "ఏంచెల్లాయ్"అంటూ పలుకరించి జవాబు ఆశించకుండానే మేడ మెట్లు ఎక్కి తనగదికి వెళ్లసాగేడు. అతడు మేడమెట్లు అన్నీ ఎక్కేవరకు అటు చూస్తూ అప్పుడు తన దృష్టిని మార్చింది దమయంతి!

"నమస్తే యంతీ!" అంటూ వుత్సాహంగా తనక్లాసుమేటు రమణమ్మ ప్రవేసించింది. బండిల్ లో వున్న తన పేరుగల యిన్విటేషను కార్డు బయటకు తీసి యిచ్చి కుర్చీలోకూలబడ్డది!

కవరు విప్పిచూచింది దమయంతి. వరుని పేరు రమాపతి అట...వివాహం ఇంకా నాలుగురోజులు వుందని గ్రహించింది.

"కన్‌గ్రాచులేషన్స్" అంది దమయంతి నీరసంగా, లేని ఆనందము తెచ్చుకుంటూ!

"అదేమిటే అలావున్నావ్? అప్పుడే నలభైఏళ్లవృద్ధలా తయారయ్యావ్? ఏం! వంట్లో బాగులేదా?" అంది రమణమ్మ.

"ఒంట్లో బాగానే వుందే! ఏం అలా అడిగేవ్?"

"నీ ముఖం చూస్తే పదిలంకణాలు చేసినట్టు కనిపిస్తున్నావ్? ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూనే వుంటావ్? ఎందుకే అంత ఆలోచన"

"నీగురించేనే?"

"ఏమిటీ! నాగురించా?"

"అవునే."

"నాగురించి అంతదీర్ఘంగా ఆలోచించడానికి ఏముందే?"

"అదే! నువ్వు నాతో క్లాసులో అన్న మాటలకీ, ఇప్పుడు నీవుచేస్తున్న చేతలకీ!" షాక్ తిన్నట్టు ఫీలయింది రమణమ్మ.

"నేనేంటన్నానే క్లాసులో?"

"అదే! వివాహం ఇప్పటినుండీ చేసుకోనన్నావుకదూ ... చదువు పోతుంది... ఇంకా ఏవేవో చెప్పేవే! అవి అన్నీ ఇప్పుడేమిటయ్యాయా అని — "

లేనినవ్వు తెచ్చుకుంటూ యిలా అంది రమణమ్మ. "పిచ్చిదానా! అన్నవన్నీ చెయ్యగలమా చెప్పు? మొన్ననాన్నగారు

నాకు వివాహము చేస్తానని అన్నారు ... ఇప్పటినుండీ వద్దు, చదువుపోతుంది...అని అన్నాను. అయితే వింటేనా? ఆమూర్నాడే నన్ను స్కూలు మానిపించేరు ... ఆనాడే నన్ను చూసేందుకు ఎవరో వస్తారని అమ్మ నాన్నా చెప్పేరు" —

...ఆగింది దమయంతి వింటున్నాదో లేదో అని.

"చెప్పు, చెప్పు..." అంది దమయంతి.

"అతను వచ్చేరు ఆవాళే"!

"ఎవరే?"

"అతనేనే ...... ఆయన" ...... సిగ్గు పడ్డది!

"ఓహో నీకు కాబోయే భర్తగారా!"

సిగ్గుతో "పోదూ! నువ్వు మరీని ... ఆయననన్ను చూసేరు ... నేను ఆయనను చూసేను..."

(సశేషము)

—(౦)—

గృహోపయోగాలకు సూర్యరశ్మి వినియోగం

వేడిప్రాంతమైన ఉజ్బెకిస్తాన్ పరిశ్రమలలోనూ, దైనందిన జీవితంలోనూ సూర్యరశ్మి మున్ముందు ఎక్కువగా వినియోగింపబడుతుంది. తాష్కెంట్‌లో సోవియట్ విజ్ఞాన శాస్త్ర పరిషత్తుకు చెందిన ప్రయోగ సూర్యరశ్మి సాంకేతిక కేంద్రంలో వివిధరకాల సూర్యరశ్మి యంత్రాలు డిజైన్ చేయబడ్డాయి, పరీక్షింప బడ్డాయి. సూర్యరశ్మి సాయంతో స్వల్పవ్యవధిలో మూడుపంటలతో భోజనం వండడానికి వీలుగా ఒక సులువైన, సౌకర్యవంతమైన పొయ్యి తయారు చెయ్యబడింది. ఇది టెస్టుచేయబడి, ఎక్కువగా ఉత్పత్తి చేయడానికి పరిశ్రమల కివ్వబడింది. సూర్యరశ్మితో పనిచేసే బాయిలర్ (నీళ్లుకాచుకోడానికి), షవర్ బాత్ కూడా టెస్టులలో నెగ్గేయి. ఈ యంత్రాలుకూడా ఎక్కువగా ఉత్పత్తి చేయబడతాయి.

పవర్ ఇంజినీరింగ్ విద్యాసంస్థలో పోస్టుగ్రేడ్ విద్యార్థి క్లిచ్‌టగయేవ్ ప్రయోగ సూర్యరశ్మి సాంకేతిక కేంద్రంలో ఆసక్తి జనకమైన పరిశోధనచేశాడు. రిఫ్రిజిరేటింగ్ కోసం సూర్యరశ్మి వినియోగంపై ఒకసిద్ధాంతవ్యాసం రచించాడాయన. సూర్యరశ్మితో పనిచేసే ఒక రిఫ్రిజిరేటర్ (ఇంటిలోవాడు కునేది) కు డిజైన్‌ను గురించి అందులో వ్రాశాడు. అది సులువైన యంత్రం. ఆర్థికంగా లాభదాయకం కూడాను. ఎండ కాసేరోజులు ఎక్కువగావుండే మధ్య ఆసియా రిపబ్లిక్కులలోని ప్రజలలో దీనికి గిరాకీ బాగావుంటుంది.

డాక్టరు కే. యన్. కేసరిగారి రచన

'నా చిన్ననాటి ముచ్చట్లు'

వెల రు. 3–0–0 — పోస్టేజి ఉచితం

అన్ని హిగిన్ బాదమ్స్ స్టాల్సులోను దొరుకుతవి.